సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 7 । జూలై । 2025



సిఫార్సు ఉంటేనే సీటు

ఏపీఎండీసీ బడిలో చేరాలంటే రాజకీయ నాయకుల సిఫార్సులు తప్పని సరి అయిపోయింది. యాజమాన్యం తీరుపై ఉద్యోగులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -8లో



వైభవంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలు

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో శివ,కేశవుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1192 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ధర లేక..దిక్కుతోచక



ఎక్స్‌వేటర్‌తో తోతాపురి మామిడి చెట్లను తొలగిస్తున్న రైతు మహేంద్రరెడ్డి

కలికిరి: తోతాపూరి రకం మామిడికి ధరలు లేకపోవడంతో మండలంలోని పారపట్లకు చెందిన రైతు తోటను పూర్తిగా తొలగించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు... పారపట్లకు చెందిన రైతు కంభం మహేంద్రరెడ్డి ఇరవై ఏళ్ల క్రితం రెండు ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరం తోతాపురి మామిడి రకం, మిగిలిన ఎకరం విస్తీర్ణంలో మల్లిక, ఖాదర్ కరం చెట్లు నాటాడు. ఇప్పుడు తోతాపురి రకానికి ధరలు లేవు. కనీసం రూ.2కు కూడా అడిగే నాథుడే కరువయ్యాడు. దీంతో రైతు ఆవేదనతో ఎకరం విస్తీర్ణంలోని తోతాపురి రకం మామిడి తోటను ఎక్స్‌వేటర్ సాయంతో పూర్తిగా తొలగించేశాడు. మామిడి చెట్లను తొలగించి ఇతర పంటలైనా సాగు చేసుకోవచ్చని, ఏడాదంతా కాపాడిన తోతాపూరితో నష్టం తప్ప ఏనాడు పెట్టుబడి కూడా చేతికందలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు వైఎస్ జగన్ రాక



పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేటి నుంచి రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 5గంటలకు ఆయన హెలీకాప్టర్ ద్వారా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి పులివెందులలోనే బస చేయనున్నారు. మంగళవారం ఉదయం దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా పులివెందుల నుంచి ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ ఉదయం 7.30గంటల నుంచి 8.15గంటల వరకు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం పులివెందులకు చేరుకుంటారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌లో ప్రజలతో మమేకం అవుతారు. మంగళవారం సాయంత్రం పులివెందుల భాకరాపురం హెలీప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నియామకం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, లా కళాశాలల పరిశీలన, పర్యవేక్షణకు కమిటీని నియమిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహించకున్నా పరీక్షలు నిర్వహిస్తోందని విద్యార్థి, ప్రజాసంఘాల నుంచి వినతులు రావడంతో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు మార్గదర్శకం మేరకు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

హార్సిలీహిల్స్‌పై చిత్తూరు కలెక్టర్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడికి వచ్చిన ఆయనకు రెవెన్యూ అధికారులు, టూరిజం సిబ్బంది స్వాగతం పలికారు. అటవీశాఖ ప్రాంగణంలో బ్రిటిష్ కలెక్టర్ డబ్ల్యూడీ హార్సిలీ నిర్మించిన బంగ్లా, పురాతన మహానీలగిరి వృక్షాన్ని తిలకించారు. వాటి వివరాలను అటవీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండ నుంచి వెనుదిరిగి వెళ్లారు.

జంతువులను ప్రేమిద్దాం



పశువులకు వ్యాక్సిన్ అందిస్తున్న పశుసంవర్ధకశాఖాధికారి గుణశేఖర్ పిళ్లై

రాయచోటి: మానవ జీవితంలో భాగంగా ఉన్న జంతువులను ప్రేమిద్దామని పశు సంవర్ధకశాఖ జిల్లాధికారి గుణశేఖర్ పిళ్లై అభిప్రాయపడ్డారు. ఆదివారం పశువైద్యశాలలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచ జునోసిస్ దినోత్సవం ప్రాముఖ్యత గురించి పెంపుడు జంతువుల యజమానులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 80 కుక్కలు, పిల్లలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు.పెంపుడు జంతువులకు కావాల్సిన మల్టీ విటమిన్ టానిక్కులను రోటరీక్లబ్ ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. పశువైద్యశాల ఏడీలు శివారెడ్డి, లోకేష్, క్లబ్ సభ్యులు పబిశెట్టి సురేష్ కుమార్, రోటరీక్లబ్‌కు చెందిన వైవీఎస్ ప్రకాష్, జోషి, ఖాదర్‌బాషా, అఫ్రష్, సురేష్, శశిరెడ్డి, శంకర్, రూపేష్, శంకరరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురఫలం.. ధర పతనం

తోటల్లోనే వదిలేశా



నా పేరు అరమాటి వెంకటరమణారెడ్డి. సంబేపల్లె మండలం గున్నికుంట్ల గ్రామం. నాకు 4 ఎకరాల్లో బేనీషా రకం మామిడి చెట్లు ఉన్నాయి. ఈసారి తెగుళ్ల అధికంగా ఉండడంతో మందులు,ఇతర ఎరువులకు రూ. 2 లక్షలు పెట్టబడి పెట్టాను. గతంలో బేనీషా టన్ను రూ. 50-60 వేల వరకు అమ్ముకునే వాళ్లం.ఈసారి వీటిని అడిగే వారు లేరు. ధర లేకపోవడంతో కాయలను చెట్లపైనే వదిలేశాను.ప్రతిసారి పెట్టుబడిపోను రూ. 4 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఈసారి ఏమీలేదు.

- తోతాపురి టన్నుకు రూ 4-5 వేలలోపే
- కోయడానికి ఇష్టం లేక తోటల మీద వదిలేస్తున్న వైనం
- మామిడి రైతులను పట్టించుకోని కూటమి సర్కార్
- వైఎస్సార్ సీపీ హయాంలో ధరలతోపాటు దిగుబడులు ఆశాజనకం



పీలేరు తలుపుల వద్ద రోడ్డు వారగా మామిడి కాయలను పారబోసిన దృశ్యం

సాక్షి రాయచోటి: మామిడి రైతులకు ఈసారి కష్టం ..కన్నీరే మిగిలింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విపత్కర పరిస్థితులతో రైతు కుదేలయ్యాడు. మామిడి రైతును ఆదుకుంటామని పైకి ప్రగల్భాలు పలికిన కూటమి సర్కార్ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. తోతాపురి మామిడి పంటకు సంబంధించి కాయలు అడిగే వ్యాపారులు లేకపోగా...గుజ్జు ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళ్లినా కిలో రూ. 4-5లకు అడుగుతుండడంతో గిట్టుబాటు కాదని మామిడి రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. గతంలో ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళితే కనీసం టన్నుకు రూ. 750 చొప్పున రవాణా ఛార్జీలు ఇచ్చేవారు. అవి కూడా లేకుండా ఇప్పుడు కేవలం టన్నుల ప్రకారం తీసుకుంటుండడంతో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణంగా ప్రతి ఏడాది మార్చిలో సీజన్ ప్రారంభమై జులై చివరి నాటికి ముగుస్తుంది. అయితే ఈసారి ప్రకృతి దెబ్బతీయడంతో పంట సరిగా రాక అల్లాడి పోతున్న తరుణంలో ధరలు కూడా పతనం కావడంతో కొంతమంది రైతులు ఏకంగా రోడ్లపై పారబోస్తున్నారు.

గిట్టుబాటు ధర లేక....

జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి. జిల్లాలో సుమారు 37 వేల హెక్టార్లలో మామిడిని సాగు చేశారు.ప్రధానంగా లాల్‌బహార్, బేనీషా, ఖాదర్, తోతాపురి, ఇమామ్ పసంద్, చెరుకు రసం, సువర్ణ రేఖ, దసేరి, మలుగ్బా తదితర రకాలు సాగు చేశారు. అయితే ప్రస్తుతానికి అన్ని రకాలకు సంబంధించిన దిగుబడులు ముగుస్తున్నాయి. అంతో ఇంతో బేనీషా, నీలం , తోతాపురి (బెంగుళూరు) లభిస్తున్నాయి. ప్రస్తుతం ధరలు లేకపోవడంతో తోతాపురిని అడిగే వారే లేకపోయారు. లోకల్‌గా రూ 3-5 మధ్య కిలో ధర పలుకుతోంది. అప్పటికీ టన్ను రూ. 3-5 వేలు మాత్రమే కనిపిస్తుండడంతో ఎంతమాత్రం గిట్టుబాటు కాదని రైతులు పొలాల మీదనే వదిలేస్తున్నారు. కొంతమంది చెట్లకు బరువు వద్దని రోడ్డు వారగా పారవేస్తున్నారు. ప్రభుత్వం అదనంగా రూ. 5 పెంచి ఇస్తామన్న ఇప్పటివరకు అతీగతీ లేని పరిస్థితుల్లో అన్నదాతలు ఆవేదనలో మునిగిపోయారు. వైఎస్సార్ సీపీ హయాంలో గిట్టుబాటు ధరలుబాగా ఉండడంతో మామిడి రైతులు పంటను విక్రయిస్తూ వచ్చారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ కూడా ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న సందర్భాలు లేవని రైతులు పేర్కొంటున్నారు.

ఫ్యాక్టరీల వద్ద ఎదురుచూపులు

మామిడి సాగు చేసిన రైతులు చివరకు ఖర్చుకైనా వస్తుందని ఆశించి...తోటలో ఉన్న దిగుబడిని ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళితే అక్కడ నిరీక్షణ తప్పలేదు. ఎందుకంటే ఫ్యాక్టరీలు తక్కువగా ఉండడం..చిత్తూరు, వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి చిత్తూరులోని గుజ్జు పరిశ్రమలకు కాయలు వస్తున్నాయి. దీంతో ఫ్యాక్టరీ వారు టోకెన్లు ఇచ్చి తీసుకుంటుండడంతో రోజుల తరబడి కాయలను విక్రయించేందుకు వేచి ఉండాల్సి వస్తోంది. ఫ్యాక్టరీల వద్ద కూడా ఎదురుచూసే పరిస్థితి రావడంతోనే అక్కడికి తీసుకు వెళ్లేందుకు కూడా రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేకోడూరు మార్కెట్‌లో మామిడి కాయల రాశులు

గిట్టుబాటు ధరలు లేవు



మూడు ఎకరాలలో మామిడి చెట్లు ఉన్నాయి. దాదాపు రూ 1.50 లక్షలు పెట్టుబడిపెట్టాను. అయితే కాయలు ఉన్నా అడిగేవారే లేరు. మామిడి పంటకు మూడు సార్లు మందు కొట్టాను. దిగుబడి కూడా పర్వాలేదనిపించినా ధర లేకపోవడంతో గిట్టుబాటు కాలేదు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– ఎం.నాగిరెడ్డి, గున్నికుంట్ల, సంబేపల్లె మండలం

రూ.4లక్షలు ఖర్చు చేశా..



సుమారు 16 ఎకరాల్లో మామిడి సాగు చేశా. మందులు పిచికారి చేయడం, కొమ్మలు కత్తిరించడం తదితర యాజమాన్య నిర్వహణకు రూ. 4 లక్షలకు పైగా ఖర్చు అయింది. ఈ ఏడాది మామిడికి ధర లేక పోవడంతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాలేదు. కాయలు మొత్తం రాలిపోయాయి. తీవ్రంగా నష్టం వచ్చింది. మామిడి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి.

– నారే వెంకటరమణారెడ్డి, మామిడి రైతు, పీలేరు.

ఎన్నడూ లేనంతగా నష్టపోయాం



చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి పంటను సాగు చేసి నష్టపోయాం. 40 ఎకరాల్లో మామిడి తోటలో ప్రతిఏడాది రూ. 20 లక్షల కంటే ఆదాయం ఏనాడూ తగ్గలేదు. ఈ ఏడాది ధరలు లేకపోవడంతో లక్ష రూపాయలు కూడా రాలేదు. కనీసం తోటకు పిచికారి చేసిన మందు ఖర్చులు కూడా రాకపోవడం దారుణం.

– టంగుటూరి శివారెడ్డి, మామిడి రైతు, ఓబులవారిపల్లె మండలం

మొహర్రం.. వైభవం



చిన్నమండెంలో గంధం పీర్ల ఊరేగింపు

జిల్లాలో మొహర్రం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.తొమ్మిది రోజులుగా పలు గ్రామాలు, పట్టణాల్లో పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లకు ఆదివారం నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది.అధిక సంఖ్యలో ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొని ప్రార్థనలు చేశారు. చిన్నమండెంలో జరిగిన గంధపు పీర్ల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

హంసవాహనంపై సౌమ్యనాథుడు



తొలి ఏకాదశి సందర్భంగా దర్శనానికి బారులు తీరిన భక్తులు



హంసవాహనంపై ఊరుగుతున్న సౌమ్యనాథుడు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజు ఆదివారం ఉదయం పల్లకీసేవ జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథుడు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు సునీల్‌కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్‌కుమార్, సాయిస్వామి అధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో స్వామివారు దేవేరులతో కలిసి మాడవీధుల్లో విహరించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం పల్లకీసేవ, తిరుమంజనం, రాత్రికి సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

- తొలి ఏకాదశిని పురస్కరించుకొని సౌమ్యనాథ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మట్టిమాఫియా బరితెగింపు

- చెరువులే టార్గెట్‌గా అక్రమ దందా
- ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





చిన్నమండెం రెడ్డివారిపల్లి పెద్దచెరువులో హిటాచితో టిప్పర్‌లో మన్ను నింపుతున్న దృశ్యం, మట్టి తీసుకెళ్తున్న టిప్పర్

రాయచోటి: జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మట్టి తవ్వకాలకు అనుమతులు లేకున్నా తెలుగు తమ్ముళ్లు పోటాపోటీగా చెరువులను చెరబడుతున్నారు. చెరువుల్లో ఎండలకు నీరు తగ్గిపోవడం అవకాశంగా తీసుకున్న తమ్ముళ్లు, వారితో కలిసి వ్యాపారం సాగిస్తున్న దళారులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు అధినేతల నుంచి ఒత్తిళ్లు, అవసరమైన మేర మామూళ్ల ఎర చూపడంతో వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో అడ్డూ అదుపు లేకుండా మట్టి రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వానికి రూపాయి చెల్లించకుండానే వేల రూపాయల మట్టిని మార్కెట్లో అమ్ముతూ కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న తమ్ముళ్లు, దళారులు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తూ అక్రమదందా యథేచ్ఛగా సాగిస్తున్నారు.

- మట్టి మాఫియా రాయచోటి, చిన్నమండెం, రామాపురం, సంబేపల్లి మండలాల్లో పెట్రేగిపోతుంది. ఖాకీలను సైతం లెక్కచేయకుండా దందా సాగిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లో సాగుతున్న దందా కావడంతో నిరాటంకంగా మట్టి రవాణా జరుగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చెరువులను పంచుకున్న తమ్ముళ్లు

చిన్నమండెం మండలంలోని శ్రీనివాసపురం నాగిరెడ్డి రిజర్వాయర్, కేశాపురం రెడ్డివారిపల్లె గ్రామంలోని పెద్దచెరువు, రాయచోటి సమీపంలోని కంచాలమ్మ గండిచెరువు, ఇనాయత్ ఖాన్ చెరువు, సిబ్యాల చెరువు, సంబేపల్లి మండలంలోని సంబేపల్లి, దుద్యాల గ్రామాల సమీపంలోని చెరువులను టార్గెట్‌గా మట్టి మాఫియా అక్రమ మట్టి దందా సాగిస్తోంది. మట్టి తవ్వి టిప్పర్లకు ఎత్తిపోసేందుకు జేసీబీలు హిటాచీలను వాడుతున్నారు.వీటివాడకం వల్ల చెరువుల్లో భారీగా గోతులు ఏర్పడి రాబోయే రోజులలో వీటి రూపురేఖలు మారిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నమండెం మండలంలోని రెడ్డివారిపల్లి పెద్దచెరువును ఒకసారి పరిశీలిస్తే మట్టి తరలింపుతో దీని రూపురేఖలు ఎలా ఉన్నాయో అర్థం అవుతుందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఈ చెరువులపై తెలుగు తమ్ముళ్లు ఒక ఏరియాలో ఒక్కొక్కరుగా కేటాయింపు చేసుకొని దందాలు సాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకుల పర్యవేక్షణ లోపించడంతో అడిగేవారు ఎవరు అన్నట్టుగా చెరువుల్లో మట్టిని తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు

ఇష్టానుసారంగా చెరువుల్లోని మట్టిని తోడేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మట్టి మాఫియా పగలూ రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో చెరువు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది తెలుగు తమ్ముళ్లు, దళారులు కలుసుకొని పంట పొలాలకు మట్టి అవసరం అని రైతుల పేరిట అనుమతులు తీసుకుంటూ కమర్షియల్ అవసరాలకు మార్కెట్లో విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు తీసుకెళ్తే ఫైన్

అధికారపార్టీ నాయకులు, అధికారుల అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తరలించిన రైతులపై చర్యలు తప్పడం లేదు. వారిపై పోలీసు కేసులు, రెవెన్యూ అధికారుల దాడులు తప్పడం లేదు. తమ పొలాలకు మాత్రమే అని చెప్పినా వినకుండా రైతులపై అపరాధ రుసుములతో వేధింపులకు గురిచేస్తున్నారు. అధికారుల కళ్లెదుటే అధికార పార్టీ నాయకుల టిప్పర్లు రయ్ రయ్ రయ్‌మంటూ పరుగులు తీస్తున్నా పట్టించుకున్న పాపానపోలేదు.

క్లుప్తంగా

మడుగులో యువకుడి గల్లంతు



యువకుడు గల్లంతైన మడుగు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామ సరిహద్దులలో ఝరికోన ప్రాజెక్టు సమీపంలోని మడుగులో యువకుడు గల్లంతు అయినట్లు సమాచారం. పోలీసుల వివరాల మేరకు కర్నూలుకు చెందిన షేక్ ఉస్మాన్ (23)అనే యువకుడు ఆదివారం తన స్నేహితులతో కలిసి ఝరికోన ప్రాజెక్టు దగ్గరకు వచ్చాడు. సమీపంలోని మడుగులో గల్లంతు అయినట్లు పోలీసులు తెలిపారు. మడుగు సమీపంలోని దుస్తులు, చెప్పులను గుర్తించి ఉస్మాన్ అనే యువకుడు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. చీకటి కావడంతో సోమవారం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నీటిలో గల్లంతయ్యాడా లేక మరేమైనా జరిగిందా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శేఖర్ రెడ్డి (ఫైల్)

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం, తూర్పుపల్లి క్రాస్ సమీపంలో ఇన్నోవా కారు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న శేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా.. శేఖర్‌రెడ్డి వండాడి గ్రామానికి తన సొంత పనుల నిమిత్తం వచ్చాడు. తిరిగి రాయచోటిలోని తన నివాసానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. దీంతో శేఖర్‌రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ద్విచక్ర వాహనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో ఆదివారం బైకును కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు స్థానిక కోదండ రామస్వామి కల్యాణ వేదిక మొదటి గేటువద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపై ఏపీ 04బీఏ 6437 నెంబరుగల బైకులో ఓబులవారిపల్లిలో బంధువుల ఇంటికి వెళ్తున్న ఎస్. సురేంద్ర, జి.ఉమాదేవి అనే దంపతులను తిరుపతి నుంచి కడప వైపు వెళ్తున్న ఏపీ21ఏయూ 5699 నెంబరుగల ఇథియోస్ కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర కుడిచేయి, కాలు విరగ్గా, ఉమాదేవికి నడుము విరిగింది. వీరిని 108 సహాయంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యంకోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

బహుజన టీచర్స్ యూనియన్ ఆవిర్భావం

కడప రూరల్ : బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నూతన సంఘం ఆవిర్భావ సమావేశం ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా మేకల శివార్జున, ప్రధాన కార్యదర్శిగా సి.సుదర్శన్ బాబు, కోశాధికారిగా ఏ.రాజబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎం.గంగరాజు, కె.గంగాధర్, ఎం.శ్రీదేవి, ప్రేమ సాగర్ నిత్య ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడిగా గంగరాజు, కార్యదర్శిగా బేరి మోహన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా కట్టా గంగాధర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏపీఎండీసీ బడిలో సిఫార్సు ఉంటేనే సీటు

- నీరుగారిపోతున్న సీఎస్ఆర్ పాలసీ లక్ష్యం
- యాజమాన్యం తీరుపై ఉద్యోగులు, స్థానికుల ఆగ్రహం



మంగంపేట గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఏపీఎండీసీ పాఠశాల

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలో పనిచేసే ఉద్యోగులు, గనుల విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలు, చుట్టు పక్కల పేద పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో కోట్లు ఖర్చు చేసి ఏపీఎండీసీ పాఠశాలను నిర్మించి నిర్వహిస్తోంది. అయితే ప్రస్తుతం ఏపీఎండీసీలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని సిఫార్సుతో ధనికులు, స్థానికేతరుల పిల్లలకే సీట్లు కేటాయిస్తున్నారు. సీటు రాకపోవడంతో నిర్వాసిత కుటుంబాల వారు, ఉద్యోగులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

ఏపీఎండీసీ పాఠశాలకు భలే గిరాకీ..

తమ పిల్లలను ఏపీఎండీసీ పాఠశాలలోనే చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుండటంతో పాఠశాలకు గిరాకీ పెరిగింది. 2018వ సంవత్సరంలో ఏపీఎండీసీ పాఠశాల ప్రారంభించారు. 30 గదులతో దాదాపు 450 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది.

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చొరవతో మధ్యాహ్న భోజనం

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చొరవతో ఏపీఎండీసీ పాఠశాల విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. పాఠశాలలో చదివే 1050 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం ఉండటంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరిచేవారు.

సీటు కావాలంటే సిఫార్సు తప్పనిసరి..

పాఠశాలలో చేరాలంటే ఏపీఎండీసీ యాజమాన్యానికి ఎమ్మెల్యే, ఎంపీ ఆపై స్థాయి రాజకీయ నాయకుల సిఫార్సులు తప్పని సరి అయిపోయింది. విద్యార్థి స్థానికుడైనా, ఏపీఎండీసీ ఉద్యోగి సంతానమైనా, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారైనా ప్రస్తుతం సిఫార్సు లేఖలు తప్పనిసరి అని యాజమాన్యం, అధికారులు తెగేసి చెబుతున్నారు. అర్హత ప్రామాణికంగా పిల్లలకు సీటు కేటాయించాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడులకు ఏమీ చేయలేని పరిస్థితులు ఉన్నాయి.

నూతన భవనాలు ఏర్పాటు చేయాలి

ఏపీఎండీసీ పాఠశాల ప్రారంభంలో 30 తరగతి గదులతో దాదాపు 500 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. అయితే ప్రస్తుతం 1050 మంది విద్యార్థులు ఉన్నా అవే తరగతి గదులు ఉన్నాయి. అదనపు తరగతి గదులు కట్టించాలని గతంలో ప్రతిపాదనలు చేసినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ఏపీఎండీసీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో నూతన తరగతి గదులను ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

నిర్వాహకుల చేతివాటం..

సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు ఇవ్వకుండా నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. తరగతిని బట్టి ఐదు వేల రూపాయల నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు పుస్తకాలను అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సహకారంతో ఉచిత భోజనం



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో ఏపీఎండీసీ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ మిథున్‌రెడ్డి ఉచితంగా భోజనం అందిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులతో ఉచితంగా పుస్తకాలను అందిస్తే బాగుంటుంది.

– తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, మంగంపేట కాపుపల్లె, ఓబులవారిపల్లె

రెండేళ్లుగా సీటు కోసం పాట్లు



రెండేళ్లుగా ఏపీఎండీసీ పాఠశాలలో నా కొడుకు సీటు కోసం ప్రయత్నం చేస్తున్నాను. అయినా దొరకడం లేదు ఎన్నిసార్లు ప్రయత్నించినా సీట్లు లేవని నిర్వాహకులు చెబుతున్నారు. గత ఏడాది ఐదో తరగతిలో చేర్పించేందుకు తిరిగాను. ప్రస్తుతం ఆరవ తరగతిలోనైనా చేర్పిద్దామని వెళితే అసలు ఎవరూ పలకడం లేదు. కనీసం అప్లికేషన్ కూడా ఇవ్వలేదు. ఎవరితోనూ సిఫార్సు చేయించుకొనే స్తోమత మాకు లేదు.

– కొప్పల మణి, అయ్యలరాజుపల్లె, ఓబులవారిపల్లె

సీట్లు పరిమితంగా ఉన్నాయి



పాఠశాలలో 45 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయితే నిర్వాసితులు, ఉద్యోగులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 145 వరకు దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం ఎల్‌కేజీలో మాత్రమే ప్రవేశాలు జరుగుతున్నాయి. అదనపు తరగతి గదులు తదితర అంశాలపై పాఠశాల నిర్వాహకులతో చర్చించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాము.

– గోపీనాథ్, సీపీఓ, ఏపీఎండీసీ మంగంపేట, ఓబులవారిపల్లె

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె రూరల్ : బైక్ అదుపు తప్పి వ్యక్తి గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన ఆనంద (45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని సందిరెడ్డిపల్లె వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన ఆనంద స్థానికుల సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చెవి కొరికేశాడు



బాధితుడికి కొంత భాగం తెగిపోయిన చెవి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ గుండాలేరు వద్ద ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అహ్మద్ అనే వ్యక్తి మల్లు శ్రీసాయి అనే వ్యక్తి చెవి కొరికేశాడు. అతని చెవి కొంత భాగం తొలగి పోయింది. శనివారం రాత్రి పీర్ల పండుగను పురస్కరించుకొని అందరూ ఒక చోట చేరడంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని వాదులాటకు దిగినట్లు తెలిసింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలు



తాళ్లపాకలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో శివ,కేశవుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున అన్నమాచార్యుడు ఆరాధించి, పూజించిన శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శివ, కేశవుల వాహనసేవలివే..

బ్రహ్మోత్సవాల తొలిరోజున శ్రీ సిద్దేశ్వరస్వామి హంసవాహనంపై, శ్రీ చెన్నకేశవస్వామి శేషవాహనంపై విహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈఓ ప్రశాంతి పర్యవేక్షణలో తాళ్లపాక, నందలూరులో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జులై నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా ఆలస్యమైనందున వెంటనే మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన్ కోరారు. రాయచోటి పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రవీంద్రారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, భాస్కర్ రెడ్డి, మున్వర్‌బాషా, గోపీకృష్ణ, మోహన్, గురుమూర్తి, మురళి మనోహర్, సునీర్, జనార్దనరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు శ్వేతశ్రీ అప్పగింత



శ్వేతశ్రీ చంద్ర, తల్లితండ్రులతో ఎస్‌ఐ

మదనపల్లె : చదవలేకపోతున్నానని, ఫీజు విషయంలో అవమానపడినట్టు లేఖ రాసి చచ్చిపోతానంటూ ఇంటినుంచి అదృశ్యమైన మూడో సంవత్సరం డీఫార్మసీ విద్యార్థిని శ్వేతశ్రీ చంద్రను ఆదివారం మదనపల్లె రూరల్ సీఐ కళావెంకటరమణ, ఎస్‌ఐ గాయత్రిలు తల్లిదండ్రులు సూర్యనారాయణ, సుజాతలకు అప్పగించారు. శుక్రవారం ఆత్మహత్య లేఖరాసి వెళ్లిన పోయిన శ్వేతశ్రీ చంద్ర అదృశ్యంపై తండ్రి మదనపల్లె రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ కొనుగొన్నారు. తిరుమలలో ఉన్నట్టు గుర్తించి ఇక్కడికి తీసుకొచ్చారు. ఆదివారం సీఐ మీడియాతో మాట్లాడుతూ శ్వేతశ్రీ చంద్ర అదృశ్యం వెనుక సరిగ్గా చదవకపోవడం, కళాశాలలో జరిగిన అవమానం తదితర కారణాలు ఉన్నట్టు వివరించారు. తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నట్టు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

గాలివీడు : భార్య కాపురానికి రాలేదని తుపాకుల గోపాల్ (37) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు అరవీడు గ్రామం మలసానివాండ్లపల్లెకు చెందిన తుపాకుల వెంకటరమణ, రమణమ్మ దంపతుల కుమారుడు గోపాల్ మద్యానికి బానిసై భార్య రమణమ్మ, నలుగురు సంతానాన్ని నిర్లక్ష్యం చేశాడు. దీంతో అతని భార్య మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన గోపాల్ తన భార్య తిరిగి కాపురానికి రాదేమోనన్న సందేహంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం కురబలకోట మండలం సర్కారుతోపు వద్ద ఉన్న బండ్లపల్లెలో జరిగింది. బండ్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి (30) ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మర్యాదగా మట్లాడమంటే దాడి చేశారు



దాడిలో గాయపడిన కార్తీక్

మదనపల్లె రూరల్ : వైన్‌షాపు వద్ద ఏర్పడిన వివాదంలో మర్యాదగా మాట్లాడమంటే ఓ వ్యక్తిపై నలుగురు దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని డివి జగన్ కాలనీకి చెందిన జనార్దన్ కుమారుడు కార్తీక్(30) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బెంగుళూరు రోడ్డు నక్కలదిన్నె వద్ద ఉన్న వైన్‌షాపు వద్దకు మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన గాంధీపురానికి చెందిన గౌతమ్‌తో వివాదం ఏర్పడింది. మాటామాటా పెరగడంతో కార్తీక్ వయస్సులో పెద్దవాడినైన తనను మర్యాదగా మాట్లాడాలంటూ గౌతమ్‌ను హెచ్చరించాడు. దీంతో ఆవేశానికి లోనైన గౌతమ్ తన అనుచరులు మరో ముగ్గురితో కలిసి దాడికి పాల్పడి విచక్షణారహితంగా కొట్టాడు. మరో సారి ఫోన్ చేసి పిలిపించి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్తీక్‌పై దాడి చేసి కొట్టాడు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ దేవత

లక్కిరెడ్డిపల్లె : గంగమ్మ దేవతా కరుణించి కాపాడు తల్లీ అంటూ మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవతకు వేలాది మంది భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి రావడంతో క్యూ లైన్ల ద్వారా అమ్మవారి దర్శనం కల్పించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోణాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు.

భార్య వెళ్లిపోయిందని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంకటేష్

మదనపల్లె రూరల్ : భార్య తనను వదిలి వెళ్లిపోయిందని మనస్థాపంతో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండకు చెందిన నరసింహులు కుమారుడు వెంకటేష్ (22)కు రెండు సంవత్సరాల క్రితం నిమ్మనపల్లె మండలం కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన లిఖితతో వివాహం జరిగింది. ఇటీవల కొంత కాలంగా భార్య, భర్తలతో సఖ్యత లేకపోవడంతో వారం రోజుల క్రితం లిఖిత భర్తను వదిలి వెళ్లిపోయింది. పెద్దలను సంప్రదించినా ఆమె కాపురానికి వచ్చేందుకు నిరాకరించడంతో మనస్థాపం చెందిన వెంకటేష్ ఇంటి వద్ద చీమల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భరత నాట్యంలో కలికిరి వాసికి బంగారు పతకం



ప్రియదర్శిని నుంచి గుర్తింపు పత్రం, బంగారు పతకం అందుకుంటున్న కలికిరికి చెందిన రియాజుల్లా

కలికిరి : తమిళనాడు రాష్ట్రం సేలంలో ఎస్ఏఎస్ ఈవెంట్స్, కైలాస మానస సరోవర స్కూల్ ఆధ్వర్యంలో నటరాజ నర్తనం ప్రపంచ భరతనాట్య పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ దేశాలతో పాటు, జాతీయ స్థాయిలో పలు రాష్ట్రాల నుంచి 3వేల మంది ప్రదర్శకులు హాజరై 30 నిమిషాల పాటు ఒకే సారి ఏకధాటిగా నృత్య ప్రదర్శన చేసి, నటరాజ స్వామికి నాట్య నీరాజనాన్ని సమర్పించారు. దీంతో ఈవెంట్ ప్రపంచ రికార్డులకెక్కింది. కార్యక్రమానికి జిల్లా నుంచి కలికిరి పట్టణానికి చెందిన షేక్ రియాజుల్లా(పండు) హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమిళ నటి ప్రియదర్శిని ఈయన నృత్య ప్రదర్శనకు గాను ఇంటర్నేషనల్ టైమ్స్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు పత్రంతో పాటు, బంగారు పతకాన్ని అందజేసి అభినందించారు.

ఉరి వేసుకుని మహిళా రైతు ఆత్మహత్య

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన మహిళా రైతు కటారు రామాంజనమ్మ(47) శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. రామాంజనమ్మ గత కొన్నేళ్లుగా భర్తతో కలసి వ్యవసాయం చేసుకుంటూ, పాడి పశువులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయంలో నష్టాలు రావడం, అప్పులు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

గండి టెండర్లలో నిబంధనలకు పాతర

- సరైన మార్గదర్శకాలు లేవంటున్న భక్తులు
- ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని ఆందోళన



గండి వీరాంజనేయ స్వామి ఆలయం(ఫైల్)

చక్రాయపేట : గండి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా నిర్వహించే టెండర్లలో నిబంధనలకు పాతర వేసినట్లు కనిపిస్తోంది. ప్రత్యేక పూల అలంకరణకు పూలు సరఫరా, చలువ పందిళ్లు, బారికేడ్లు, విద్యుద్దీపాల అలంకరణ అని ఆలయ అధికారులు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ప్రతికల్లో ప్రకటనలు కూడా అలాగే ఇస్తున్నారు. అయితే ప్రత్యేక పూల అలంకరణ అంటే ఆలయానికా లేక మూలవర్లకా అనే వివరాలు పొందు పరచలేదు. దీనికి తోడు మూలవర్లకు ప్రత్యేక అలంకరణ అంటే తోమాలలు ఎన్ని అవసరం, అవి ఎన్ని కిలోల బరువు ఉండాలి, అలంకరణ బిట్లు ఎన్ని కావాలి, వాటి బరువెంత, అలాగే పలు రకాల అల్లిన పూలు ఎన్ని కావాలి.. ఏయే రకాలు కావాలి అని కాని ఆలయంలో అలంకరణకు బంతి పూలు ఎన్ని మూరలు అనో లేక ఎన్ని కిలోలు అని వివరాలు ఉండటం లేదు. అలాగే చలువ పందిళ్లు అంటే అవి ఎన్ని అడుగులు ఎక్కడెక్కడ ఎన్ని వేయాలి అనే విషయాలు ఉండటం లేదు. బారికేడ్లు, విద్యుద్దీపాలు సీరియల్ సెట్లు, ఫోకస్ లైట్లు, డిజిటల్ బోర్డులు కూడా ఎక్కడ వేయాలి ఎన్ని వేయాలి అనే వివరాలు పొందు పరచలేదు. ముందుగానే వివరాలు ఉండకపోవడంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ తక్కువ మోతాదులో తెచ్చి వేయడం, చాలక పోతే మరో వారానికి తెప్పించి వేయడం జరుగుతుంది. దీని వల్ల కాంట్రాక్టర్‌కు మేలు జరుగుతుంది కాని ఆలయ ఆదాయానికి గండి పడుతుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏటా వేయిస్తూనే ఉన్నప్పటికీ..

శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఏటా అధికారులు టెండర్లు వేయిస్తున్నారు. ఏవేవి ఎన్ని అవసరమో ఆ వివరాలు అన్ని కూడా ఆలయ కార్యాలయంలోనే అందుబాటులో ఉంటాయి. ఎందుకంటే గతంలో కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లులు పరిశీలిస్తే ఈ దఫా ఏవేవి ఎన్ని అవసరం అనే విషయాలు కచ్చితంగా తెలుస్తాయి. గతంలో ఏవి ఎక్కడ వేశారో ఇప్పుడు అక్కడే వేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆలయ పరిధిలో విస్తీర్ణం తక్కువగానే ఉంది. ఈ విషయం ఆలోచించకనే దేవదాయశాఖ అధికారులు టెండర్లు పిలవడం నిబంధనలను పక్కన పెట్టినట్లేనని పలువురు భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పూల విక్రయ హక్కు టెండర్లలో చెప్పేది ఒకటి జరిగేది మరొకటి..

ఏడాది కాలం పాటు పూలు విక్రయించుకునే హక్కు విషయంలో అధికారులు చెప్పేది ఒకటయితే అనంతరం టెండరు దక్కించుకున్న వ్యక్తి చేసేది మరోలా ఉంటోంది. పూల విక్రయం అంటే పూలు, పూల దండలు మాత్రమే విక్రయించాలి. కాని ఇక్కడ వాటిని అసలు విక్రయించరు. తమలపాకులు తెచ్చి వాటిని దండలా కూర్చి దేవస్థానం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ దండలకు చివరన పూలతో కుచ్చును కూడా ఏర్పాటు చేయరు. ఈ విషయాన్ని పలువురు భక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల సమయంలో తమలపాకుల దండల ఊసే లేకున్నా కాంట్రాక్టర్లు వాటినే విక్రయించడంపై విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ఖాళీ స్థలం టోల్‌గేట్ల కాంట్రాక్టర్‌కు వరం

ఆలయ పరిధిలోనే గల నూతన కల్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలం టోల్‌గేట్ల కాంట్రాక్టర్‌కు వరంలా మారుతోంది. గత శ్రావణ మాసంలో ఈ ఖాళీ స్థలం టోల్‌గేట్ కాంట్రాక్టరుకు అప్పగించారు. టోల్ గేట్ టెండర్ల సమయంలో ఈ ఖాళీ స్థలం ప్రస్తావనే లేదు. శ్రావణ మాస ఉత్సవాలు వచ్చే సరికి ఈ స్థలాన్ని సదరు కాంట్రాక్టరుకు అప్పగించారు. దీంతో ఆ కాంట్రాక్టరు ఆ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయించి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఒక్కో దుకాణం వద్ద నుంచి 40 నుంచి 50 వేల వరకు బేరం కుదుర్చుకొని అందులోనే 30 నుంచి 40 వరకు దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేయించారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారులు, పాలకమండలి స్పందించి టెండర్ల వివరాలు పూలు ఎన్ని కిలోలు, ఏయే రకాలు, బారికేడ్లు ఎన్ని అడుగుల దూరం, చలువ పందిళ్లు ఎన్ని, వాటి విస్తీర్ణం ఎన్ని అడుగులు, బార్ లైట్లు ఎన్ని, ఫోకస్ లైట్లు ఎన్ని అనే వివరాలు పూర్తిగా వివరించి ఆ మేరకు టెండర్లు నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. లేకుంటే ఆలయ ఆదాయానికి గండి పడుతుందని పేర్కొంటున్నారు.

రేపు గండిలో టెండర్లు

గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని టెండర్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. నెల రోజులకు సంబంధించి పూల అలంకరణ కోసం పూలు సరఫరా, విద్యుత్ దీపాల అలంకరణ, చలువ పందిళ్లు, బారికేడ్ల ఏర్పాటుకు టెండర్లు నిర్వహిస్తామన్నారు. అలాగే దేవస్థానంలో ఏడాది కాలం పాటు పూలు విక్రయించే హక్కు, టోల్ గేట్ల వసూలు, రెండు సంవత్సరాల కాలానికి షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు సంబంధించి టెండర్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.